క్లుప్తంగా

తీర్మానాలను పాలకవర్గం దృష్టికి తీసుకెళ్తా



మాట్లాడుతున్న మండలి బుద్ధప్రసాద్

నెల్లూరు(బృందావనం): పుర మందిరంలో గత మూడు రోజులుగా జరిగిన తెలుగుభాషా ఉత్సవాల మహాసభల్లో ప్రతిపాదించిన 11 తీర్మానాల్లో ప్రభుత్వం చేపట్టాల్సిన అంశాలను పాలకవర్గం దృష్టికి తీసుకెళ్తామని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. పుర మందిరంలో ఆదివారం రాత్రి తెలుగు భాషోత్సవాల ముగింపు సభలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సభలో పాల్గొన్న తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్డీ విల్సన్ మాట్లాడుతూ తెలుగుభాషా పరిరక్షణకు ప్రత్యేక కృషి చేస్తామని పలు అంశాలను ప్రస్తావించారు. ముగింపు సభకు ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షత వహించారు. పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

నడిరోడ్డుపై విద్యుత్ స్తంభాలు



వెంకటేశ్వరపురం నుంచి జనార్దన్‌రెడ్డి కాలనీకి వెళ్లే రోడ్డులో అడ్డంగా స్తంభాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నడిరోడ్డుపై అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలతో ప్రయాణికులు, వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. నగరంలోని వెంకటేశ్వరపురం నుంచి జనార్దన్‌రెడ్డి కాలనీకి వెళ్లే ప్రధాన మార్గంలో రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో గతేడాది రోడ్డు విస్తరణ పనులు చేశారు. అయితే రోడ్డుపై అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను మాత్రం తొలగించలేదు. దీంతో రాత్రి వేళల్లో కొత్తగా వచ్చేవారు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డుపై అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించేలా చూడాలని సంబంధిత అధికారులను స్థానిక ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

సీల్డ్ టెండర్లకు ఆహ్వానం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడ కామాక్షితాయి ఆలయంలో సెప్టెంబర్ 22 నుంచి జరుగనున్న శరన్నవరాత్రులకు సంబంధించి పలు పనులకు ఈనెల 2న సీల్డ్ టెండర్లను ఆహ్వానిస్తున్నామని ఈఓ అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుద్దీపాలంకరణ, స్టేజ్, క్లాత్ పందిర్లు, బారికేడ్స్ ఏర్పాటుకు టెండర్లు వేసేవారు మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు ఆలయ ఈఓ కార్యాలయంలో హాజరు కావాలని తెలియజేశారు.

రైలు స్టాపింగ్‌కు వినతి



వెంకటాచలం: గూడూరు – విజయవాడ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు వెంకటాచలం రైల్వేస్టేషన్‌లో నిలిపేలా చొరవ చూపాలని మాజీ సర్పంచ్ వల్లెపు మునుస్వామి, బీజేపీ నాయకుడు ఆరుముళ్ల మురళి మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడిని కోరారు. వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఆదివారం ఆయనకు వినతిపత్రం అందజేశారు. దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి చెందిన కసుమూరు మస్తాన్‌వలీ దర్గా, భగవాన్ శ్రీవెంకయ్యస్వామి ఆశ్రమం మండలంలో ఉన్నందున గూడూరు – విజయవాడ ఆ రైలు ఆగితే ప్రయాణికులకు చాలా ఉపయోగంగా ఉంటుందన్నారు. మండలంలో బీఎస్ఎన్ఎల్ టవర్ సిగ్నల్స్ పని చేయడం లేదని విన్నవించడంతో వెంకయ్యానాయుడు సానుకూలంగా స్పందించారు.

వైభవంగా కల్యాణోత్సవం




పొదలకూరు: వినాయక చవితి వేడుకల్లో భాగంగా శనివారం రాత్రి పట్టణంలోని రామనగర్‌గేటు సెంటరు విఘ్నేశ్వరుని విగ్రహం వద్ద శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. భక్తులకు అన్నప్రసాదాలను ఏర్పాటు చేశారు.

• పద్మావతి నగర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద యువకులు ఆదివారం ఉట్టి మహోత్సవం నిర్వహించారు. ఐదురోజులపాటు ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. గ్రామోత్సవం ఏర్పాటు చేశారు.

వైభవంగా నిమజ్జనోత్సవం



రంగులు చల్లుకుంటున్న యువత



గంగమ్మ ఒడికి చేరుతున్న గణనాథుడు

- సింహపురిలో కోలాహలం
- భక్తజనంతో పులకించిన గణేష్‌ఘాట్, పెన్నా బ్యారేజీ

నెల్లూరు(బృందావనం): వినాయక చవితిని పురస్కరించుకుని ప్రతిష్ఠించిన గణనాథుల నిమజ్జనోత్సవం సింహపురిలో ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఐదు రోజులుగా పూజలందుకున్న గణనాథులు ఆదివారం సాయంత్రం నుంచి తెల్లవారుజాము వరకు తరలిరావడంతో నగరంలో సందడి నెలకొంది. రంగనాయకులపేటలోని పెన్నా బ్యారేజీ వద్ద ఉన్న పినాకినీ రిజర్వాయర్, మూలాపేటలోని స్వర్ణాల చెరువు గణేష్ ఘాట్ వద్దకు పార్వతీ తనయులు ఊరేగింపుగా వచ్చి గంగమ్మ ఒడిలో సేదతీరాయి. భారీ గణనాథులు నిమజ్జనోత్సవానికి తరలిరావడంతో నగరంలోని ప్రధాన మార్గాలు భక్తజనసంద్రంగా మారాయి.



పడారుపల్లి శివాలయం వద్ద..

• క్రాంతినగర్ కొండా బలరామిరెడ్డి వీధి రాజగోపాలపురంలోని శివకేశవుల దేవస్థానం వద్ద తాత్కాలికంగా ప్రతిష్ఠించిన శ్రీకృష్ణ వినాయక నిమజ్జనోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని మునిరాజ్, రాజేష్‌ఖన్నాలు దక్కించుకున్నారు. పారిశ్రామికవేత్తలు కొండా నిరంజన్‌రెడ్డి, తాటిపర్తి బాలాజీ, అడ్వొకేట్ లోకనాథం, దేవస్థానం ట్రస్ట్ చైర్మన్ దరిశిగుంట పెంచలయ్య, విజయ్, గోవిందు, వెంకటేష్‌కుమార్, సురేంద్ర, సాయి, వెంగమ్మ, నంద, హరి తదితరులు పాల్గొన్నారు.

• నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 53, 54 డివిజన్ల పరిధిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల నిమజ్జనం ఆదివారం కోలాహలంగా జరిగింది. 54వ డివిజన్‌లోని లక్ష్మీస్ట్రీట్‌లో ఏర్పాటు చేసిన భారీ వినాయక విగ్రహానికి నిమజ్జన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు.



లక్ష్మీస్ట్రీట్‌లో..

• నెల్లూరు సిటీ: రూరల్ మండలంలోని పడారుపల్లి శివాలయం వద్ద గణేష్ లడ్డూ వేలంపాటను ఆదివారం నిర్వహించారు. రూ.1.35 లక్షలకు కాగుటూరు మస్తానయ్య వేలం దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు మాచవోలు రమేష్, బాబూజీ, కార్తీక్, ప్రతాప్, వెంకటరమణయ్య పాల్గొన్నారు.



టెక్కేమిట్టలో ఉట్టి కొడుతూ..



నిమజ్జనోత్సవానికి తరలివచ్చిన శ్రీకృష్ణ వినాయకుడు

గణనాథా.. ప్రణామం



లడ్డూ వేలం

నెల్లూరు(బృందావనం): వినాయక చవితిని పురస్కరించుకొని కొండాయపాళెం రోడ్డులోని భవానీ స్కై టవర్స్ అపార్ట్‌మెంట్‌లో విశేష పూజలను నిర్వహించారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. లడ్డూను ఆదివారం వేలం వేయగా, రూ.90 వేలకు కోట రమేష్, కవిత దంపతులు దక్కించుకున్నారు. అనంతరం గణేశ్ ఘాట్ వద్ద కోలాహలంగా నిమజ్జనం చేశారు. దాసరి శ్రీనివాసులు, జయకృష్ణ, నెల్లూరు వంశీకృష్ణ, బాలకిశోర్, రామిశెట్టి సురేంద్ర, రామకృష్ణ, శ్రీనివాసరావు, భవానీ శంకర్, నారాయణరావు, ప్రభాకర్, రాజశేఖర్‌రెడ్డి, అశోక్, మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



చిన్నారి నృత్య ప్రదర్శన



విశేషాలంకారంలో గణనాథుడు

బాణసంచా ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



బాధిత చిన్నారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న సుబ్బారెడ్డి

ఉదయగిరి: మండలం అప్పసముద్రంలో వినాయక నిమజ్జనం సందర్భంగా చోటు చేసుకున్న బాణసంచా పేలుడులో గాయపడిన చిన్నారుల కుటుంబాలను రాష్ట్ర వైఎస్సార్‌సీపీ ప్రచార కమిటీ ఉపాధ్యక్షుడు చేజర్ల సుబ్బారెడ్డి ఆదివారం పరామర్శించారు. వైద్య ఖర్చులకు రూ.1.20లక్షలు ఆర్థిక సాయం అందజేశారు. అప్పసముద్రంలో ఉన్న ముగ్గురు చిన్నారులను పరామర్శించి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున అందజేశారు. అనంతరం ఆత్మకూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మరో ముగ్గురు చిన్నారులను పరామర్శించి ఒక్కొకరికి రూ.20వేలు వంతున సాయం అందజేశారు. అనంతరం నెల్లూరులోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న మరో చిన్నారికి రూ.25వేలు, స్వల్పంగా గాయపడిన మరొకరికి రూ.5వేలు చొప్పున నగదు అందజేశారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు బాలిబోయిన శ్రీనివాసులు, కల్లూరు రాజారెడ్డి, ఉప్పుటూరి హరి, జీ నరేంద్ర తదితరులు ఉన్నారు.

ఘనంగా శోభాయాత్ర



నెల్లూరు(బృందావనం): సాయి మాలధారణ మండల దీక్ష, శిరిడీ యాత్రను పురస్కరించుకుని భక్తులు ఆదివారం నగరంలో శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. పద్మావతి నగర్‌లోని సాయిదర్బార్ అద్దాల మందిరం చైర్మన్ మధుసాయి ఆధ్వర్యంలో 300 మంది భక్తులతో శోభాయాత్ర చేశారు. సాయిదర్బార్ అద్దాల మందిరం నుంచి పద్మావతినగర్, బాలాజీనగర్, విజయమహల్‌గేట్, గాంధీబొమ్మ, ఆత్మకూరు బస్టాండ్, ఏసీ నగర్, ద్వారకామయి మీదుగా మందిరానికి చేరింది. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద, అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసాయి మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాల నుంచి శోభాయాత్ర చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మందిర గౌరవ సలహాదారు పాబోలు రామసుబ్బయ్య, సాయిభక్త బృందం, సేవాదళ్ బృందం వారు పర్యవేక్షించారు.

గుండె జబ్బులపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాసరాజు

నెల్లూరు(అర్బన్): మారిన ఆహారపు అలవాట్లు, జీవన శైలి వల్ల గుండె జబ్బు బాధితులు పెరుగుతున్నారని, దీనిపై అవగాహన పెంచుకుని తగిన జాగ్రత్తలు పాటించడం వాటికి చెక్ పెట్టవచ్చని కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రీనివాసరాజు అన్నారు. వీఆర్సీ వాకర్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో వీఆర్సీ గ్రౌండ్‌లో కిమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత మెడికల్ క్యాంపు అవగాహన సదస్సు ఆదివారం జరిగాయి. ఈ సందర్భంగా శ్రీనివాసరాజు మాట్లాడుతూ మద్యపానం, ధూమపానం జోలికెళ్లకుండా కొలెస్ట్రాల్, బీపీ, షుగర్‌లను నియంత్రణలో ఉంచుకోవడంతో పాటు ఆహార నియమాలు పాటిస్తూ తగిన వ్యాయామం చేస్తే గుండెజబ్బులు రావన్నారు. అనంతరం వాకర్స్‌కు ఉచితంగా షుగర్, ఈసీజీ, బీపీ లాంటి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. లాఫింగ్ క్లబ్ అధ్యడు బండారు సుబ్బారెడ్డి, ఇంజినీరింగ్ అసోసియేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, లాఫింగ్ క్లబ్ కార్యదర్శి రియాజ్‌అహ్మద్, గౌరవాధ్యక్షుడు నన్నేసాహెబ్, వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు నేతాజి సుబ్బారెడ్డి, ఎంవీరెడ్డి, వెంకటేశ్వరరావు, రఘుఆచారి, గుర్రం వెంకటేశ్వర్లు, తాజుద్దీన్ పాల్గొన్నారు.

చలో విజయవాడకు ఫ్యాప్టో మద్దతు

నెల్లూరు (టౌన్): సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ సోమవారం ఏపీసీపీఎస్‌ఈఏ ఆధ్వర్యంలో చేపట్టిన చలో విజయవాడకు ఫ్యాప్టో సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు ఫ్యాప్టో జిల్లా చైర్మన్ మధుసూదనరావు, జనరల్ సెక్రటరీ జావీద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో మూడు లక్షల మందికిపైగా ఉద్యోగ, ఉపాధ్యాయులు సీపీఎస్ వల్ల ఇబ్బందులకు గురవుతున్నట్లు చెప్పారు. సామాజిక భద్రత లేక ఉద్యోగ విరమణ అనంతరం అతి తక్కువ పెన్షన్‌తో బాధపడుతూ మానసిక క్షోభ అనుభవిస్తున్నారన్నారు. జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై చలో విజయవాడను జయప్రదం చేయాలన్నారు.

వాకర్స్‌కు వైద్య పరీక్షలు



వాకర్స్‌కు సూచనలిస్తున్న వైద్యులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్టేడియంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. వైద్యులు శ్రీనివాసకుమార్, శ్రీధర్‌రెడ్డి, కృష్ణమూర్తి పాల్గొని 300 మంది వాకర్స్‌కు బీపీ, షుగర్ లెవల్స్ తదితర పరీక్షలు చేసి మందులు అందజేశారు. కిలారి వెంకటస్వామి నాయుడు జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు మెడికల్ క్యాంపునకు సహాయ సహకారాలు అందించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పాబోలు సత్యనారాయణ, కార్యదర్శి స్నేహా సురేష్, వేలూరు రంగారావు, బాసం శేషగిరిరావు, దద్దోలు రమణయ్య, అనంతరామారావు, అరిగల సాయిరాం, హరి, భాగవతుల రాఘవేంద్ర, వెంకటరామారావు, రమేష్, నరసయ్య, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి వినతి



నెల్లూరు(బృందావనం): జిల్లాలో బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘాల సమితి నేతలు విజయవాడలో రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రామ్‌ప్రసాద్‌ను ఆదివారం కలిసి, విన్నవించారు. గరుడ స్కీమ్‌ను పునరుద్ధరించాలని, తొలగించిన పెన్షన్లను పునరుద్ధరించాలని, అలాగే అర్హులైన బ్రాహ్మణులకు పెన్షన్లు ఇవ్వాలంటూ పలు సమస్యలపై వారు చర్చించారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఆ నేతలు తెలిపారు. సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.వాసుదేవరావు, దుద్దుకూరు రమేష్‌బాబు, కోశాధికారి రామాయణం మణికుమార్, జిల్లా అర్చక సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఉదయగిరి వెంకట శేషాచార్యులు, ఆదిశైవ అర్చక సంఘం ప్రధాన కార్యదర్శి గుడ్లూరు ఫణికుమార్‌శర్మ, ప్రేరేపి శ్రీనివాసశర్మ, జీవీ సుబ్రహ్మణ్యశర్మ పాల్గొన్నారు.

అసభ్య వ్యాఖ్యలు కూటమి పాలనకు నిదర్శనం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిపై మరోసారి అనుచిత వ్యాఖ్యలు చేసిన కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డిపై వైఎస్సార్‌సీపీ నేతలు విరుచుకుపడ్డారు. పొదలకూరు రోడ్డులోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి కావ్యతీరుపై ధ్వజమెత్తారు. ఆయన అసభ్య వ్యాఖ్యలు కూటమి పాలనకు నిదర్శనంగా నిలుస్తోందని దుయ్యబట్టారు.

కావ్యకు బెదిరేవారు లేరు



కావ్య కృష్ణారెడ్డి అరిచినంత మాత్రాన ఇక్కడ అదిరేవారు.. బెదిరేవారు లేరని వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ సెక్రటరీ జనార్దన్ స్పష్టం చేశారు. అక్రమ మైనింగ్‌ను బయటపెడుతున్నారని మా నాయకులు, కార్యకర్తలపై అప్రజాస్వామికంగా దాడులు చేయించి, పోలీసులతో అక్రమ కేసులు పెట్టించడం దారుణమన్నారు. నీ అవినీతి దందాలు కావలి ప్రజలందరికీ తెలుసన్నారు. కూటమి అక్రమ కేసులపై నిజాలు బయటపెట్టిన మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం కావ్య దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. పక్కన మహిళలు, పిల్లలున్నారనే సంస్కారం లేకుండా అనాగరికంగా మాట్లాడడం సిగ్గుచేటన్నారు. తమ నాయకులు కావలికి వస్తామంటే పోలీసుల ద్వారా గృహ నిర్బంధాలు చేయించడం చూస్తుంటే ఎవరు భయపడుతున్నారనే విషయం ఇట్టే తెలుస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యాకర్తల్లో భయపడే వారు ఒక్కరూ లేరన్నారు. మా నేతలపై మరోసారి అసభ్యకరంగా మాట్లాడితే సహించేది లేదని స్పష్టం చేశారు.

ఎందుకు భయపడుతున్నావు



కావ్య కృష్ణారెడ్డి కార్వీలో అన్నీ సక్రమంగా జరుగుతుంటే భయమెందుకు అని వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా రాష్ట్ర జాయింట్ సెక్రటరీ అవుల తులసీరామ్ యాదవ్ అన్నారు. పోలీసులు, నీ చెంచాలు పక్కన లేకుంటే కావలి ప్రజలే నిన్ను గుర్తుపట్టరన్నారు. అధికారం ఉందని విర్రవీగితే రేపటి రోజు ఒకటి ఉందన్న విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. గతంలో నీ అవసరాల కోసం మా నాయకుడి ఇంటి చుట్టూ ఎన్నిసార్లు తిరిగావో అందరికీ తెలుసన్నారు. మరోసారి నోరుపారేసుకుంటే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో ముత్తుకూరు, వెంకటాచలం జెడ్పీటీసీ సభ్యులు బందెల వెంకటసుబ్బయ్య, పోట్లూరి సుబ్రహ్మణ్యం, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి గుమ్మడి నరసయ్య, నాయకులు అనీల్, ఆనంద్, ప్రభాకర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సవాల్‌కు భయపడి ఇంట్లో దాక్కున్నావ్



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలపై కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి అలియాస్ కత్తుల కొండయ్య విసిరిన సవాళ్లను స్వీకరించి కావలికి బయలుదేరితే పోలీసులను అడ్డుపెట్టుకుని ఇంట్లో దాక్కుని, ఇప్పుడు బీరాలు పలకడం ఏమిటని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు, కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున అన్నారు. కావ్య అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక అక్రమాలు దుర్మార్గాలు, దౌర్జన్యాలతో పాటు చీకటి సామ్రాజ్యాన్ని స్థాపించాడన్నారు. ఆయన అక్రమాలు, దుర్మార్గాలను కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి వెలుగులోకి తెచ్చాడన్న అక్కసుతో అక్రమ కేసులు పెట్టించారన్నారు. మనీస్కీమ్‌లో ఆయన పాత్ర బయటపడుతుందని రామిరెడ్డిపై అక్రమ కేసులు పెట్టించాడన్నారు. కావ్య కృష్ణారెడ్డి దుర్మార్గాలను ప్రజలు కూడా ఛీదరించుకుంటున్నారన్నారు. గొర్రెలఫామ్‌ను ఏర్పాటు చేసి రూ.కోట్లు దండుకుని ప్రజలను నట్టేట ముంచిన వ్యక్తి కావ్య అని ఆరోపించారు. పాతికేళ్ల క్రితం చిరుద్యోగిగా ఉన్న నీవు.. నేడు ఎలా కోట్లకు పడగలెత్తావో ప్రజలందరికీ తెలుసన్నారు. విలువలతో రాజకీయాలు చేస్తున్న మా నేతలపై నీచంగా అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు.

సభ్యత నేర్చుకో..



డబ్బుతో సీటు కొట్టేసి ఫస్ట్ టైమ్ ఎమ్మెల్యే అయ్యావు.. కాస్త సభ్యత కూడా అలవరుచుకో అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మల్లి నిర్మలా హితవు పలికారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డి జైలుకు వెళ్లింది తప్పుచేసి కాదనీ, కూటమి ప్రభుత్వం బనాయించిన అక్రమ కేసులతోనే అని స్పష్టం చేశారు. కాకాణిపై చేసిన వ్యాఖ్యలు ఎంతో జుగుప్సాకరంగా ఉందని, తొలి ప్రెస్‌మీట్‌లో నీ పక్కన ఉన్న మహిళలు రెండోసారి ప్రెస్‌మీట్‌లో ఎందుకు రాలేదో తెలుసుకోవాలని సూచించారు. జిల్లాలో పదికి పదిసీట్లు గెలిచి వైఎస్సార్‌సీపీ సత్తా చూపిస్తామని తెలిపారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డి జనతాగ్యారేజ్ లాంటివాడని.. మళ్లీ అధికారంలోకి వస్తే అన్నింటినీ రిపేర్లు చేస్తారని చెప్పుకొచ్చారు. సమావేశంలో టీపీగూడూరు జెడ్పీటీసీ సభ్యురాలు ఎంబేటి శేషమ్మ, దువ్వూరివారిపాళెం సర్పంచ్ కృష్ణవేణి, సర్వేపల్లి మహిళా విభాగం అధ్యక్షురాలు ఎంబేటి సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.